పట్టభద్రుల ఓటు నమోదుకు మరో చాన్స్

- ముసాయిదా జాబితాలో ఓటు హక్కును సరిచూసుకోవాలి
- మార్చి 14లోపు దరఖాస్తుకు అవకాశం
- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా

జనగామ, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ) : వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎన్నికలకు జిల్లాలో అర్హులైన పట్టభద్రులు మార్చి 14లోపు తమ ఓటు హక్కును ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. ఇప్పటికే వెల్లడించిన పట్టభద్రుల ఓటరు ముసాయిదా జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే సవరణకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. నవంబర్ 2020 నాటికి డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన పట్టభద్రులు ఓటరుగా నమోదుకు అర్హులని వెల్లడించారు. గతంలో ఓటు నమోదు చేసుకున్నప్పటికీ మళ్లీ నమోదు చేసుకోవాలని సూచించారు. గత నెల 24న పట్టభద్రుల ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురించామని, జనగామ జిల్లాలో 13,991 పురుషులు, 7,878 స్త్రీలు, ఒక థర్డ్ జెండర్ కలిపి మొత్తం 21,870 పట్టభద్రులు ఓటరుగా నమోదైనట్లు తెలిపారు. ఇటీవల ఓటు నమోదు చేసుకున్న పట్టభద్రులు తమ ఓటు హక్కును సరి చేసుకోవడంతోపాటు అర్హులైన వారు ఫారం18 ద్వారా తహసీల్దార్ కార్యాలయాల్లో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ముసాయిదా జాబితాలో అనర్హత కలిగిన వారి పేర్లు నమోదైతే అభ్యంతరాలు తెలపాలని కోరారు. పట్టభద్రులు ఓటరు జాబితాలో నమోదుకు డిగ్రీ మెమో ఒరిజినల్ లేదా ప్రొవిషనల్ సర్టిఫికెట్, ఓటర్ ఐడీ కార్డు, పాస్ ఫొటో, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, ఈ-మెయిల్ ఐడీతో ఆన్‌లైన్ అప్లికేషన్ http://ceotserms2.telangana.gov.in/mlc/form18.aspx వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు.

ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వినతిపత్రం అందిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

ఎమ్మెల్యే కడియంను కలిసిన
బార్ అసోసియేషన్ సభ్యులు

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 29 : డివిజన్ కేంద్రానికి మంజూరైన సివిల్ కోర్టులో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరిని స్టేషన్‌ఘన్‌పూర్ బార్ అసోసియేషన్ నాయకులు కోరారు. అధ్యక్షుడు కనకం రమేశ్ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను కలిశారు. స్టేషన్ ఘన్‌పూర్‌లోని ఎస్సీ హాస్టల్ భవనంలో కోర్టు ఏర్పాటవుతున్నందున ఆ భవనంలో మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మునిగాల రవీందర్, ప్రధాన కార్యదర్శి పిల్లి కార్తీక్, జాయింట్ సెక్రటరీలు గుర్రం బాబు, శర్మకుమారి, కోశాధికారి గద్దె అనిల్ కుమార్, పిట్టల కమలాకర్, బీ ఐలయ్య, కొట్టె శృజన, భీమనాథం శ్రీనివాస్, అబ్బాస్ అలీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో కళాశాల డైరెక్టర్ విజయ్‌పాల్‌రెడ్డి

ముగిసిన అమేజాన్ టెక్నికల్ ట్రైనింగ్

జనగామ రూరల్, ఫిబ్రవరి 29 : మండలంలోని యశ్వంతాపూర్ గ్రామంలోని క్రీస్తుజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న అమేజాన్ టెక్నికల్ ట్రైనింగ్ గురువారం ముగిసినట్లు కాలేజీ డైరెక్టర్ విజయ్‌పాల్‌రెడ్డి తెలిపారు. మూడు వారాలుగా ఫైనల్ ఇయర్ విద్యార్థులకు సాఫ్ట్‌స్కిల్స్, క్లౌడ్ కంప్యూటరింగ్‌లో తర్ఫీదు అందించినట్లు పేర్కొన్నారు. ఇందులో 103 మంది విద్యార్థులు నైపుణ్యం సాధించి, ఉద్యోగావకాశాలు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమాన్ని నిర్వహించిన ఐసీటీ రిలేషన్ షిప్ మేనేజర్ షేక్ గౌస్ పాషాను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ఘన స్వాగతం పలకాలి

- జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి
- చలో మేడిగడ్డను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపు

లింగాలఘనపురంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి

లింగాలఘనపురం, ఫిబ్రవరి 29 : మేడిగడ్డకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వస్తున్న సందర్భంగా శుక్రవారం నెల్లుట్ల బైపాస్ రోడ్డు వద్ద పార్టీ శ్రేణులు 2వేల మందితో ఘన స్వాగతం పలకాలని జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. మేడిగడ్డపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలను ఎండ గట్టేందుకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ప్రజలకు అందుతున్న ఫలాలను తెలియజేస్తామన్నారు. ఎన్నికల్లో ప్రజలకు గుప్పించిన హామీలను అమలుచేయలేక ప్రజలను తప్పుదారి పట్టించేందుకు కాంగ్రెస్ పార్టీ ఇలాంటి దుష్ప్రచారం చేపట్టిందన్నారు. నెల్లుట్ల బైపాస్ దగ్గరికి బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు, అనుబంధ సంఘాల బాధ్యులు 2వేల మంది తరలివచ్చి కేటీఆర్‌కు ఘన స్వాగతం పలకాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బస్వగాని శ్రీనివాస్‌గౌడ్, గవ్వల మల్లేశం, నాయకులు బొల్లంపెల్లి నాగేందర్, కేమిడి భిక్షపతి, కేమిడి యాదగిరి, మల్ల శ్రీశైలం, ఎడ్ల రాజు, ఏదునూరి వీరన్న, కేమిడి వెంకటేశ్ పాల్గొన్నారు.

నేడు చలో మేడిగడ్డ..

దేవరుప్పుల, ఫిబ్రవరి 29 : శుక్రవారం నిర్వహించే చలో మేడిగడ్డ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ కేటీఆర్ పిలుపు మేరకు మేడిగడ్డకు పోవడానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాలన్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి ఆదేశాలతో ఉదయం 8గంటల వరకు మండలంలోని నాయకులు జనగామ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయానికి రావాలని ఆయన కోరారు. అక్కడి నుంచి మేడిగడ్డకు తరలివెళ్లనున్నట్లు తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్సైలు

రఘునాథపల్లి ఎస్సైగా నరేశ్

బాధ్యతలు స్వీకరించిన నరేశ్

రఘునాథపల్లి ఫిబ్రవరి 29 : రఘునాథపల్లి ఎస్సైగా దూదిమెట్ల నరేశ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ విధుల్లో ఉన్న సీహెచ్ రఘుపతి ఖానాపురం ఎస్‌హెచ్‌వోగా బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో వీఆర్‌లో ఉన్న నరేశ్ వచ్చారు. ఈ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహరించాలని ఎస్సై కోరారు.

జఫర్‌గఢ్ ఎస్సైగా రవియాదవ్

బాధ్యతలు చేపడుతున్న ఎస్సై రవియాదవ్

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 29 : జఫర్‌గఢ్ ఎస్సైగా రవి యాదవ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో నర్సంపేటలో పని చేస్తున్న రవి యాదవ్ జఫర్‌గఢ్‌కు వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎస్సై మహేందర్ నెక్కొండకు బదిలీ ఆయ్యారు.

చిల్పూరు ఎస్సైగా రాజేందర్

బాధ్యతలు చేపడుతున్న ఎస్సై రాజేందర్

చిల్పూరు, ఫిబ్రవరి 29 : చిల్పూరు ఎస్సైగా ముత్యం రాజేందర్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ఎస్సై బొల్లం వినయ్‌కుమార్ స్టేషన్ ఘన్‌పూర్‌కు బదిలీ కాగా, వీఆర్ నుంచి ముత్యం రాజేందర్ చిల్పూరుకు వచ్చారు. కాగా, నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సైకి పోలీస్ సిబ్బంది స్వాగతం పలికారు.

లింగాలఘనపురం ఎస్సైగా చింత రాజు

బాధ్యతలు చేపట్టిన చింత రాజు

లింగాలఘనపురం; ఫిబ్రవరి 29 :లింగాలఘనపురం ఎస్సైగా చింత రాజు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలు దళారులను ఆశ్రయించకుండా నేరుగా తమను కలిసి న్యాయం పొందాలని సచించారు. యువత గుట్కా, గుడుంబా, ర్యాగింగ్ వంటి మహమ్మారికి దూరంగా ఉండాలన్నారు. గతంలో తాను సుబేదారి, నర్సంపేటలో ఎస్సైగా పనిచేసినట్లు తెలిపారు. ప్రజలందరికీ సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

కేసీఆర్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి

హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న ఎంపీటీసీ స్వరూపాగణేశ్

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 29 : కేసీఆర్ పాలనలోనే గ్రామాల్లో అభివృద్ధి జరిగిందని ఎంపీటీసీ కనకం స్వరూపాగణేశ్ అన్నారు. మండలంలోని చాగల్లు గ్రామంలో జడ్పీ నిధుల నుంచి ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను గురువారం ప్రారంభించారు. అనంతరం పద్మశాలీ కాలనీలో మండల పరిషత్ నిధులు రూ.2.50లక్షలతో అండర్ డ్రైనేజీ పనులతోపాటు ఎస్సీ కాలనీలో రూ.1.50లక్షలతో సీసీ రోడ్డు పనులను కూడా ప్రారంభించారు. బీఆర్ఎస్ ఎస్సీసెల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ కనకం రమేశ్, భాస్కుల యాదగిరి, ఐలపాక శ్రీనివాస్, భాస్కుల కుమార్, శ్రీనివాస్, చందు, భిక్షపతి, సంజీవ, ఆకారపు రాములు, అశోక్, కారోబార్ చిరంజీవి పాల్గొన్నారు.

విద్యార్థులకు అతిథి భోజనం

నాగభూషణాన్ని సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 29 : పంచాయతీరాజ్ శాఖలో గ్యాంగ్ మెన్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా ఓ వ్యక్తి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అతిథి భోజనం ఏర్పాటు చేశాడు. గురువారం మండలంలోని శివునిపల్లి గ్రామానికి చెందిన పిట్టల నాగభూషణం పంచాయతీరాజ్ శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందాడు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశాడు. ఈ మేరకు హెచ్ఎం లక్ష్మీప్రసాద్ ఆధ్వర్యంలో నాగభూషణం దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్, బీఆర్ఎస్వీ నియోజకవర్గ ఇన్‌చార్జి లకావత్ చిరంజీవినాయక్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర యూత్ కార్యదర్శి గోరంట్ల యాదగిరి, లంబాడి ఐక్య వేదిక నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా రవీందర్‌నాయక్, పాఠశాల సిబ్బంది రాజేందర్, భాస్కర్, రేవతి, భూపాల్, కవిత, అనిత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తిరిగి ఈ-కేవైసీ

ఆలీంపూర్‌లో ఇంటింటికీ తిరిగి ఈకేవైసీ చేయిస్తున్న డీలర్ ఐలమ్మ

బచ్చన్నపేట, ఫిబ్రవరి 29 : రేషన్ కార్డుదారులు ఈ-కేవైసీ చేయించుకునేందుకు గురువారం ఆఖరు రోజు కావడంతో ఆలీంపూర్ గ్రామ రేషన్‌డీలర్ పాకాల ఐలమ్మ ఇంటింటికీ తిరిగి ఈ-కేవైసీ చేయించారు. ప్రభుత్వం అందించే బియ్యం అందుకోవాలంటే కార్డులో ఉన్న ప్రతి ఒక్కరూ ఈ-కేవైసీ చేయించుకోవాలన్నది ప్రభుత్వ నిబంధన. అందులో భాగంగానే గ్రామంలో ఎవరూ మిస్ కావొద్దనే ఉద్దేశంతో ఐలమ్మ ఇంటింటికీ తిరిగి ఈ-కేవైసీ చేయించారు. ఆరోగ్యపరంగా ఇబ్బందులు పడుతున్న వారు రాలేక పోయినందున తానే వారి ఇంటికి వెళ్లి కేవైసీ చేయించినట్లు ఐలమ్మ తెలిపారు.

ఈ మేరకు ఆమెకు మాజీ సర్పంచ్ నరెడ్ల బాల్‌రెడ్డి, ఎంపీటీసీ ఎండీ మసూద్ కృతజ్ఞతలు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కోహెడ, బాటసింగారం, శ్రీమిత్ర, జనచైతన్య, మౌంట్ ఒపేర, గ్రీన్ సిటీ, సుచిరిండియాలో ప్లాట్లు కొనబడును. నో Brokrs. 9553973999 / 6303049720.
NT-313892

WANTED

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319447

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

స్టేషన్ ఘన్‌పూర్‌లో నేడు విజయ సంకల్ప యాత్ర

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 29 : బీజేపీ చేపడుతున్న విజయ సంకల్ప యాత్ర శుక్రవారం స్టేషన్ ఘన్‌పూర్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక శివాజీ సర్కిల్ వద్ద కార్నర్ మీటింగ్ ఉంటుందని, ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి నారాయణ స్వామి, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటెల రాజేందర్ హాజరు కానున్నట్లు తెలిపారు. కాగా, కార్యక్రమ ఏర్పాట్లను మాజీ మంత్రి విజయరామారావు పరిశీలించారు.

దేవరుప్పలలో ఏసీపీ పర్యటన

దేవరుప్పుల, ఫిబ్రవరి 29 : దేవరుప్పుల మండల కేంద్రంలో గురువారం ఏసీపీ అంబటి నర్సయ్య పర్యటించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌తో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌లో పెండింగ్ కేసులు, పోలీసుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఇంటర్ పరీక్షలకు తీసుకోవాల్సిన చర్యలను ఎస్సై చెన్నకేశవులుకు వివరించారు. ఆయన వెంట పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి ఉన్నారు.

పదో తరగతితోనే భవిష్యత్

జనగామ రూరల్, ఫిబ్రవరి 29 : పదో తరగతి విద్యార్థుల భవిష్యత్ నిర్ణయిస్తుందని ఎంపీటీసీల ఫోరం అధ్యక్షురాలు బండ లక్ష్మీ వెంకటేశం తెలిపారు. మండలంలోని సిద్దెంకి గ్రామంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అందజేసిన పరీక్షా ప్యాడ్లను ఆమె పదోతరగతి విద్యార్థులకు గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం అనిత, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఎస్ఎంసీ చైర్మన్ మడిపల్లి సుధాకర్ గౌడ్, నాయకులు పుప్పాల కరుణాకర్ పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

కొడకండ్ల, ఫిబ్రవరి 29 : మండల కేంద్రానికి చెందిన గాడిపల్లి సతీశ్ కొన్ని నెలల క్రితం ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతుండగా అతడికి గురువారం బెస్ట్‌ఫ్రెండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.15వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ప్రసన్నకుమార్, కార్యదర్శి పసునూరి సురేశ్, ఉపాధ్యక్షులు షేక్ అక్బర్, నర్మెట మమతారాణి, కార్యదర్శి చెరుకు సంధ్యారాణి, మేడుదుల అశోక్, వెంకటరత్నం, పల్లె అనిల్ తదితరులు పాల్గొన్నారు.


జనగామ పట్టణంలో బహుమతులు పొందిన విద్యార్థులతో డీఈవో రాము

స్టేషన్‌ఘన్‌పూర్ : విద్యార్థిని హర్షితకు బహుమతి అందిస్తున్న అధికారులు

విద్యార్థులకు జిల్లాస్థాయి పోటీలు

జఫర్‌గఢ్ : విద్యార్థులను అభినందిస్తున్న మండల నోడల్ అధికారి ఫర్వేజ్

జనగామ, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ) : పాఠశాల విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఎన్జీసీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఏకశిల బీఈడీ కాలేజీలో జిల్లాస్థాయి డ్రామా పోటీలను నిర్వహించారు. పోటీల్లో జిల్లాలోని మొత్తం 30 పాఠశాలల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొని ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో డీఈవో కే రాము, ఎన్జీసీ స్టేట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ విద్యాసాగర్, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ బీ శ్రీనివాస్, ఏసు రమేశ్, జీసీడీవో గౌసియా బేగం, రామరాజు, నవీన్, అనిల్ పాల్గొని విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడడం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులు వారి నాటక ప్రదర్శన ద్వారా వివరించడం అభినందనీయమన్నారు. అనంతరం డ్రామా పోటీల్లో గెలుపొందిన పాఠశాలల విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

ఏకపాత్రాభినయంలో విద్యార్థిని ప్రతిభ

స్టేషన్ ఘన్‌పూర్ : జనగామ జిల్లా కేంద్రంలో గురువారం నేషనల్ గ్రీన్ కార్ప్స్(ఎన్‌జీసీ) హైదరాబాద్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఎన్‌జీసీ అంశంపై జరిగిన జిల్లా స్థాయి ఏకపాత్రాభినయంలో డివిజన్ కేంద్రంలోని బాలికల హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని ద్వితీయ స్థానంలో నిలిచినట్లు హెచ్ఎం శారోన్ తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వడ్లకొండ హర్షిత ద్వితీయ స్థానంలో నిలిచి బహుమతి గెలుచుకున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జీసీడీవో జిల్లా అధికారి గౌస్య, ఉపాధ్యాయురాలు శైలజ, రవికుమార్, దారణ సత్యప్రకాశ్, శ్రీకాంత్, రత్నాకర్, కల్యాణి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కూనూరు పాఠశాలలో పారిశుధ్య నిర్వహణ

జఫర్‌గఢ్ : మండలంలోని కూనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఎన్జీసీ(నేషనల్ గ్రీన్ కార్ప్స్) ఆధ్వర్యంలో విద్యార్థులతో పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో తడి, పొడి చెత్త, ప్లాస్టిక్, గాజు పెంకుల వ్యర్థాలను వేరు చేశారు. ముఖ్యఅతిథిగా మండల నోడల్ అధికారి ఎండీ ఫర్వేజ్ పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, చంద్రమోహన్, రవి, గిరిజ, స్వరూప, వేణుగోపాల్, విజయశ్రీ, సిరాజ్, కరుణశ్రీ, శంకర్, ఉమ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

స్వయం పరిపాలన వేడుకలో పాల్గొన్న విద్యార్థులు

పాలకుర్తి, ఫిబ్రవరి 29 : మండలంలో వావిలాల జడ్పీహెచ్ఎస్‌లో గురువారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం హెచ్ఎం పోతుగంటి నర్సయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు వీరమల్ల బాబయ్య పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం కోసం ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. ఉపాధ్యాయులు సదానందం, వరప్రసాద్, సోమానినాయక్, సోమ మల్లయ్య, కొండయ్య, సుగుణాదేవి, రజిత, రాజ్‌కమల్, యాకన్న పాల్గొన్నారు.

ఆర్డీవో వెంకన్నకు శుభాకాంక్షలు తెలుపుతున్న తహసీల్దార్

స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీవోగా డీఎస్ వెంకన్న

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 29 : స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీవోగా డీఎస్ వెంకన్న గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ఇక్కడ విధులు నిర్వర్తించిన వాసం రామ్మూర్తి ఏటూరునాగారం బదిలీ కాగా, ఏటూరు నాగారంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(టీడబ్ల్యూ)గా పని చేస్తున్న డీఎస్ వెంకన్న ఇక్కడికి వచ్చారు. కాగా, బాధ్యతలు చేపట్టినట్లు ఆర్డీవోకు తహసీల్దార్ వెంకటేశ్వర్లుతోపాటు ఆర్ఐ రవీందర్, ఏవో క్రాంతికుమార్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు మహా శివరాత్రి జాతరపై సమీక్ష

పాలకుర్తి రూరల్, ఫిబ్రవరి 29 : మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం జాతర ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో బీ లక్ష్మీప్రసన్న తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జాతర సమీక్ష సమావేశానికి పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. కల్యాణ మండపంలో మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ఉంటుందని, అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి టెన్త్ ప్రీ ఫైనల్ పరీక్షలు

జనగామ, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కే రాము తెలిపారు. పబ్లిక్ పరీక్షల సన్నద్ధతలో భాగంగా విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక బోధనా తరగతులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకొని వారికి స్లిప్ టెస్ట్ లాంటివి నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రీ ఫైనల్ పరీక్షలు జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి, విద్యార్థులకు ఏ విషయాల్లో తప్పులు చేస్తున్నారో వాటిని గుర్తించి, సరిదిద్దాలని ఉపాధ్యాయులకు డీసీఈబీ కార్యదర్శి చంద్రభాను సూచించారు. పరీక్షలు సమయ పాలనను అందరూ పాటించాలని ఏసీజీఈ రవికుమార్ కోరారు.

విద్యార్థులు సన్మార్గంలో నడవాలి

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ సుమలత

బచ్చన్నపేట, ఫిబ్రవరి 29 : విద్యార్థులు సన్మార్గంలో నడుచుకుంటూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని వాణి హైస్కూల్‌లో 25వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే పల్లాకు పాఠశాల యాజమాన్యం స్వాగతం పలకగా ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగజ్యోతి, వైస్ ఎంపీపీ అనిల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఇర్రి రమణారెడ్డి, చంద్రారెడ్డి, మల్లారెడ్డి, పూర్ణచందర్, జానపద కళాకారుడు శివనాగులు, ప్రొఫెసర్ వెంకటరాజయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ సుమలత, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.


డిప్యూటీ సీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న డాక్టర్ సుగుణాకర్‌రాజు

ఉప ముఖ్యమంత్రిని కలిసిన సుగుణాకర్ రాజు

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 29 : జిల్లా వైద్య విధాన పరిషత్ అధికారి డాక్టర్ సుగుణాకర్ రాజు గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ టికెట్ విషయంలో తన పేరును పరిశీలించాలని కోరినట్లు సుగుణాకర్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు.